అమృతవర్షిణి - ఆది

అన్ని మంత్రములు యిందే - ఆవహించెను
వెన్నతో నాకు గలిగే - వేంకటేశు మంత్రము

నారదుడు జపియించె - నారాయణ మంత్రము
చేరె ప్రహ్లాదుడు నార - సింహ మంత్రము
కోరి విభీషణుడు చే - కొనె రామ మంత్రము
వేరె నాకు గలిగే - వేంకటేశు మంత్రము

రంగగు వాసుదేవ మం - త్రము ధ్రువుడు జపియించె
అంగవించె కృష్ణ మంత్ర - మర్జునుడు
ముంగిట విష్ణు మంత్రము - మొగి శుకుడు పఠించె
వింగడమై నాకు నబ్బె - వేంకటేశు మంత్రము

ఇన్ని మంత్రముకెల్ల - యిందిరానాధుడే గుఱి
పన్నిన దిదియే పర - బ్రహ్మ మంత్రము
నన్నుగావ గలిగెబో - నాకు గురుడీయగాను
వెన్నెల వంటిది శ్రీ - వేంకటేశు మంత్రము

అన్నమాచార్యుల అనుభవ వైభవమిది. అందరు దేవతలూ శ్రీవేంకటేశ్వరునందే నెలకొన్నారు. అన్ని మంత్రాలూ శ్రీవేంకటేశ మంత్రంలోనే ఆవహించి ఉన్న ఈ శ్రీవేంకటేశ మంత్రం అన్నమయ్యకు వెన్నతో కలిగిందట; ధన్యులైన ఆచార్యుల తల్లిదండ్రులు ఉగ్గుతో నిగ్గుదేర్చి పట్టించినదీ మంత్రమే.

నారదులు నారాయణ మంత్రాన్ని జపిస్తూఉంటారు. 'ఓంనమో నారయణాయ' అని నారాయణాష్టాక్షరి. 'నారాయణాయ విద్మహే వాసుదేవాయ ధీమహి తన్నో విష్ణుః ప్రచోద యాత్' అని నారాయణ గాయత్రి. ప్రహ్లాద భక్తాగ్రేసరుడు నారసింహ మంత్రాన్ని చేరినాడు. 'ఓం శ్రీమద్దివ్య నృసింహాయ' అన్న మంత్రంలో బీజాక్షర జపరూపం నృసింహ మంత్రం - ఓం వజ్రనఖాయ విద్మహే తీక్ష్ణ దంష్ట్రాయ ధీమహి, తన్నో నారసిగ్ంహః ప్రచో దయాత్ - ఇది నృసింహ గాయత్రి 'శ్రీరామశ్శరణంమమ' ఇది శ్రీరామ రక్షా మంత్రం. విభీషణుడు చేసిన శ్రీరామ శరణాగతి మంత్ర మిదే. ధ్రువుడు జపించిన వాసుదేవ మంత్ర గాయత్రి - 'ఓం వాసుదేవాయ విద్మహే మహా హంసాయ ధీమహి తన్నో విష్ణుః ప్ర చోదయాత్' అర్జునుడు ఆశ్రయించినది కృష్ణమంత్రం - ఓక్లీం కృష్ణాయ గోపీజన వల్లభా య నమస్స్వాహా;' ఓం వాసుదేవాయ విద్మహే దేవకీసుతాయ ధీమహి తన్నః కృష్ణః ప్రచోద యాత్' అని కృష్ణ గాయత్రీ మంత్రం. ధ్రువుడు సాధించినది విష్ణు మంత్రము. పైన చెప్పిన మంత్రాలన్నీ విష్ణు మంత్రాలే. ఆ విష్ణు మంత్రాలన్నిటికీ లక్ష్యం శ్రీమహావిష్ణువే. ఇదే పరబ్రహ్మమంత్రం. (ఆనంద పరంబ్రహ్మేతి యోనిః- విష్ణు సహస్రనామస్తోత్రం) ఇందరిని యిన్ని విష్ణు మంత్రాలు రక్షించినవి నన్ను రక్షించడానికే ఏర్పడినట్లున్న.. అస్మదాచార్యుడు నాకనుగ్రహించిన మంత్రం శ్రీవేంకటేశమంత్రం. వెన్నెల వంటిది ఇది మనసుకెంతో ఆహ్లాదమొనర్చేది - అని బాహ్యార్థం. సహస్రదళకమలోపలి చంద్రుడు చిందించే బ్రహ్మానం దానుభవజ్యోత్స్నలవంటిది అని గూఢార్థం.

'ఓం నమో వేంకటేశాయ' అన్న అష్టాక్షరీ మంత్రంలో తక్కిన మంత్రాలన్నీ ఇమిడి ఉన్నవి. అన్నమాచార్యుల మనోవాక్కర్మలలో స్థిరనివాసం ఏర్పడింది ఆ వేంకటేశ మంత్రా నికి. శ్రీ వేంకటేశ్వర కరుణామృతవర్షిణీ విలాసం ఆ మంత్ర ప్రభావంవల్ల సంకీర్త నాచార్యులకు సతమైన సొమ్మై ఇమ్మైంది.